ప్రజాశక్తి

శనివారం 13 జనవరి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మాట తప్పి.. మడమ తిప్పి..



భార్య స్థానంలో వికెపిసిపిఐఆర్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చొక్కాకుల

- నాడు 'మహిళలే మహారాణులు' అని పలుకులు
- నేడు 'మగ మహారాజులు'కు అందలం
- విశాఖలో 'అధికార' రాజకీయమిదే..
- పిసిపిఐఆర్, గ్రంథాలయ సంస్థల ఛైర్మన్ల మార్పు వెనుక ఆంతర్యమేంటి ?
- అక్కరమాని కుటుంబానికి దక్కని చోటు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నిన్నటి వరకూ 'మహిళలే మహారాణులు' అంటూ కొనియాడిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అకస్మాత్తుగా వారి స్థానాలను వారి వారి కుటుంబాల్లోని మగవారితో నింపడం వెనుక ఆంతర్యమేమిటి ? అన్న చర్చ విశాఖలోనూ, అధికార పార్టీలోనూ అంతర్గతంగా సాగుతోంది. వైసిపి అధిష్టానం కదలికలు చూస్తే విశాఖపై ప్రత్యేక దృష్టి సారించిందన్నది స్పష్టమవుతోంది. అత్యధికంగా మధ్య తరగతి ప్రజలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలకు నెలవైన విశాఖ నగరంలో తమ పార్టీ పట్టుకోల్పోతుందన్న సంకేతాలు వైసిపిని గట్టిగా తాకినట్లు తెలుస్తోంది. మధ్య తరగతి మహిళలను ప్రభావితం చేసేలాగ కొన్ని పదవులను విశాఖలో మహిళలకు ఆ పార్టీ కేటాయించినప్పటికీ చివర వరకూ దాన్ని సిఎం జగన్ నిలుపుకోలేకపోవడం చర్చనీయాంశమైంది. ఉదాహరణకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన కొండా రమాదేవిని పక్కనపెట్టి ఆమె సోదరుడు కొండా రాజీవ్ గాంధీని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా పార్టీ నామినేట్ చేసింది. తాజాగా ముగ్గురు మహిళలకు వారి పదవులను ఇలా దూరం చేసిన ఘనత వైసిపిదే. ఇలాగైతే మహిళలకు వైసిపి ఏం గౌరవం ఇచ్చినట్టు అంటూ ఆ పార్టీలోనే దిగువ శ్రేణి మహిళా నాయకులు ఆవేదన చెందుతున్నారు..

విశాఖపట్నం - కాకినాడ వికెపిసిపిఐఆర్‌లోనూ ఇదే తంతు...

విశాఖపట్నం కాకినాడ పెట్రోలియం కెమికల్ అండ్ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (వికెపిసిపిఐఆర్) ఛైర్‌పర్సన్‌గా చొక్కాకుల వెంకటలక్ష్మి ఇప్పటివరకూ వ్యవహరించారు. తాజాగా ఆమె స్థానంలో భర్త వెంకటరావును వైసిపి అధిష్టానం కూర్చోబెట్టింది. విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన అక్కరమాని వెంకటరావు సతీమణి, 2019లో తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్‌లో వైసిపి తరపున బరిలోకి దిగి ఓటమి చెందిన అక్కరమాని విజయనిర్మలకు మిగతా 2లో..



విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల పోరాటానికి మద్దతు తెలుపుతూ సంతకాలు చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, సిఐటియు నాయకులు కుమార్

అంగన్వాడీలకు ప్రజా మద్దతు

సమ్మె శిబిరాల్లో సంతకాల సేకరణకు స్పందన

వార్తలు 8లో..

జివిఎంసి స్థాయీ సంఘంలో / పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన స్థాయీ సంఘం సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘం పొందుపరిచిన అజెండాలోని 38 అంశాలు, టేబుల్ అజెండాలోని 17 అంశాలు వెరసి 55 అంశాలను స్థాయీ సంఘ సభ్యులు చర్చించి అన్నింటినీ ఆమోదించినట్టు ఛైర్‌పర్సన్ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.4.32 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం లభించినట్టు పేర్కొన్నారు. ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పలు కార్యక్రమాలకు, అదనపు కార్మికుల సేవలను తాత్కాలికంగా ఉపయోగించుకునేందుకు, ఇతర కార్యక్రమాల కోసం సుమారు రూ.1.37 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో జాతీయ మిగతా 2లో..

అసాంఘిక చర్యలకు దిగితే కఠిన చర్యలు

వార్త 2లో..

బిల్కిస్ బానో కేసులో దోషులను తిరిగి జైలుకు పంపించాలి

వార్త 2లో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

వార్త 3లో..

ఫలించిన సిపిఎం పోరాటం

ఉక్కు నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు మంజూరు



మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : '38 ఏళ్ల సుదీర్ఘ పోరాటం వల్ల ఎట్టకేలకు ఉక్కు నిర్వాసితులైన అగనంపూడి దగ్గర లోని కర్ణవానిపాలెం, శనివాడ గ్రామాలకు చెందిన 97 మందికి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇది సిపిఎం పోరాట విజయం' అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు అన్నారు. కర్ణవానిపాలెం దగ్గరలోనే లేఅవుట్ వేసి ఒక్కో కుటుంబానికి 107 గజాల చొప్పున ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. శుక్రవారం ఉదయం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో అయన మీడియాతో మాట్లాడారు ఉక్కు కర్మాగారం నిర్మాణానికి 68 గ్రామాల ప్రజలు 23 వేల ఎకరాల భూమిని త్యాగం చేశారని. తమ ఇళ్లను, భూములను త్యాగం చేసిన అనేక మంది నిర్వాసితులకు పునరావాస సదుపాయాలు కల్పించకుండా ఏలిన పాలకులు అనేక ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. మొదట నుంచీ సిపిఎం ఉక్కు నిర్వాసితులకు అండగా ఉండి వారికి న్యాయం జరిగేలా అనేక పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కర్ణవానిపాలెం, శనివాడ గ్రామాల్లో 119 ఉక్కు నిర్వాసిత కుటుంబాలకు పాలకులు రకరకాల కుంటి సాకులు చెప్పి చట్ట ప్రకారం ఇవ్వాల్సిన 107 గజాల ఇళ్ల మిగతా 2లో..

రూ.10 కోట్లు బకాయి

◆ రైతుకు సకాలంలో పడని డబ్బులు ◆ ధాన్యం కొనుగోలు కేంద్రాల పట్ల తగ్గుతున్న ఆసక్తి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరణ మందకొడిగానే సాగుతోంది. తీవ్రమైన కరువు, కోతల సమయంలో భారీ వర్షాలతో పంట నష్టం జరగడంతో దిగుబడులు తగ్గాయి. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇచ్చిన రైతుకు సకాలంలో డబ్బులు జమకావడంలేదు. ఇప్పటికే ప్రభుత్వం రైతులకు రూ.10 కోట్లు బకాయి పడింది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల పట్ల పెద్ద అసక్తి చూపడంలేదు. గతేడాది సేకరించిన ధాన్యం పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ ఏడాది 35 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరా సంస్థ నిర్ణయించింది. ఖరీఫ్‌లో 1,36,460 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికిగానూ 1,10,765 (81 శాతం) ఎకరాల్లో సాగైంది. తరువాత వర్షాలు ఎడపెట్టడం, కోత సమయంలో భారీ వర్షాలు పడ్డంతో వరి పంట నష్టం భారీగా జరిగి దిగుబడులు పడిపోయాయి. గతేడాది కంటే ఈ ఏడాది లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తగ్గుతుందని వేసిన అంచనా కంటే దిగుబడులు తగ్గాయి.

జిల్లాలో 72 క్లస్టర్ల ద్వారా 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయాలని అనుకున్నప్పటికీ ఇంతవరకు దాదాపు 5,800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగలిగారు. జిల్లాలోని 24 మండలాల్లోవున్న 380 రైతు భరోసా కేంద్రాలను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి 72 క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. రెండు వేల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం వచ్చే కొనుగోలు కేంద్రాలను ఎ-కేటగిరీ క్లస్టర్‌గానూ, వెయ్యి నుంచి రెండు వేల మెట్రిక్ టన్నుల మధ్య వచ్చే కేంద్రాలను బి-కేటగిరీగానూ, వెయ్యి మెట్రిక్ టన్నుల కంటే తక్కువ ధాన్యం వచ్చే కేంద్రాలను సి-కేటగిరీగానూ విభజించారు. ఎ, బి కేటగిరీల్లోని క్లస్టర్లకు ఇంతవరకు 1600 మంది రైతులు 5,800 మెట్రిక్ టన్నుల ధాన్యం తీసుకొచ్చారు. అయితే వీరికి సుమారు రూ.12 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సివుండగా కోటి రూపాయలు మాత్రమే జమైంది. మరో కోటి లెక్క తేలాల్సి ఉంది. మొత్తంగా సర్కారు రూ.10 కోట్లు బకాయి పడింది. డబ్బులు ప్రభుత్వం నుంచి సకాలంలో రాకపోవడంతో కొద్దిపాటి ధాన్యం కూడా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడానికి వెనుకాడుతున్నారు.

సి కేటగిరీలోని రైతులు సొంత అవసరాలకు తప్ప అమ్ముకోవడానికి ధాన్యంలేవని చెబుతున్నారు. పంట నష్టం, ధాన్యం దిగుబడి తగ్గడం, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతుకు సకాలంలో డబ్బులు జమకాకపోవడం వంటి కారణాల రీత్యా ఈ ఏడాది 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పౌరసరఫరాల సంస్థ చేరుకొనే అవకాశాలు తక్కువగా వున్నాయి.

మొదటి పేజీ తరువాయి..

మాట తప్పి.. మడమ తిప్పి..

ఏ పదవీ ప్రస్తుతం దక్కకపోవడం గమనార్హం. ఆమె గతంలో వైసిపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగానూ పనిచేశారు. ఆ బాధ్యతలూ నేడు లేవు. విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు తూర్పు నియోజకవర్గ బాధ్యతలను అప్పగించడమే కాకుండా అక్కడి నుంచి వైసిపి అభ్యర్థిగా టిడిపి సిట్టింగ్ ఎంఎల్ఎ వెలగపూడిపై పోటీకి వైసిపి అధిష్టానం దింపింది. దీంతో తూర్పులో రాజకీయం రసవత్తరంగా మారనుంది. 'మహిళల స్థానాలను విశాఖ కేంద్రంగా గల్లంతు చేసినా వ్యతిరేకత రాకపోవడం వెనుక సొంత కుటుంబంలో వారికి ఆ పదవులను కేటాయించడమనే అంశం దాగిఉంది' అని వైసిపి నేతలు చెబుతున్నారు. ఏదిఏమైనా అతిముఖ్యమైన పదవులను మహిళలకు కేటాయించినట్లే కేటాయించి 2024 ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వెనక్కి తీసుకోవడం వెనుక పెద్ద రాజకీయమే నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇది లాభమా ? నష్టమా ? అన్న చర్చ అధికార పార్టీలో సాగుతోంది.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

స్థాయిలో విశాఖపట్నానికి నాలుగో ర్యాంకు వచ్చినందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు కార్యదర్శి పి.నల్లనయ్య, డిసి (రెవెన్యూ) ఫణిరామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఐదో జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, కార్యనిర్వాహక ఇంజినీర్లు సంతోషి కుమారి, తారాప్రసన్న, రమణమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన సిపిఎం పోరాటం

స్థలాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు, ఉక్కు యాజమాన్యం ఒకరికొకరు మాది కాదు బాధ్యత అని వివాదాలు సృష్టించి ఏళ్ల కాలంగా అన్యాయం చేస్తూ వచ్చాయన్నారు. వీరి నిర్లక్ష్యం వల్ల ఇన్నేళ్లూ పూరి గుడిసెల్లో నిర్వాసితులు దయనీయమైన జీవితం గడపాల్సి వచ్చిందని తెలిపారు. సిపిఎం ఈ సమస్యపై సుదీర్ఘ కాలం పోరాటం చేసిందని, ఉక్కు యాజమాన్యం మీద ఒత్తిడి చేసి భూ సర్వే చేయించి 119 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు లేఖలు పంపించిందని తెలిపారు. పలుసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రులు, రెవెన్యూ మంత్రుల దృష్టికి ఆ సమస్యను తీసుకెళ్లిందన్నారు. అనేకసార్లు జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక చర్చలు జరపడంతో పాటు ఆందోళనలనూ నిర్వహించిందన్నారు. చివరికి జిల్లా కలెక్టర్‌కు ఇళ్ల స్థలాల కోసం భూమిని చూపించడంతో పాటు దానిని సర్వే చేయించి లేఅవుట్ వేయించిందన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం 96 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. నిర్వాసితులకు న్యాయం చేసినందుకు జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. తక్షణం నిర్వాసితులు ఇళ్ల నిర్మాణాలు చేసుకోవడానికి రూ.10 లక్షల సబ్సిడీతో కూడిన ఆర్థిక సహకారం అందించాలని, లే అవుట్‌లో రోడ్లు, కాలువలు, విద్యుత్, మంచినీరు, ఇతర సామాజిక మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు పాల్గొన్నారు.

బిల్కిస్ బానో కేసులో దోషులను తిరిగి జైలుకు పంపించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిల్కిస్ బానో కేసులో దోషులను తిరిగి జైలుకు పంపించాలని ప్రజా, మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం భారత్ బచావో జిల్లా అధ్యక్షులు పి.వేమన, కన్వీనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి దోషులను తిరిగి జైలుకు పంపించాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ 2002లో గుజరాత్ మారణకాండలో బిల్కిస్ బానో సామూహిక అత్యాచారానికి గురైందని, బిడ్డతో సహా ఏడుగురు కుటుంబ సభ్యులను కోల్పోయిందని తెలిపారు. ఆ కేసులో మహారాష్ట్ర ముంబయి సెషన్స్ కోర్టు 11 మందిని నేరస్తులుగా పరిగణించి జీవిత ఖైదు విధించిందని తెలిపారు. ముద్దాయిలు ఈ కేసులో రెండుసార్లు బొంబాయి హైకోర్టులో శిక్ష తగ్గించాలని పిటిషన్స్ వేయగా 2019, 2020ల్లో వారి అభ్యర్థనలను కోర్టు తిరస్కరించిందని గుర్తు చేశారు. ఆ తరువాత జరిగిన పరిణామాలను వివరించారు. గుజరాత్ ప్రభుత్వం 2022 ఆగస్టు 15న భారత ప్రజల న్యాయ విశ్వాసాలను పరిహసిస్తూ నేరస్తులను విడుదల చేసిందని మండిపడ్డారు. వారి విడుదలను సుప్రీంకోర్టు తప్పుపట్టి, నేరస్తులను రెండు వారాల్లోగా తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించిందన్నారు. దేశ ప్రజల న్యాయ ఆకాంక్షలను ఈ తీర్పు ఈ కేసు విషయంలో నెరవేర్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐప్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, మహిళా చేతన కార్యదర్శి కత్తి పద్మ, జై భారత్ పార్టీ నాయకులు కారం మమత, ఎస్‌యుసిఐ అధ్యక్షులు వై.గోవిందరాజులు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రతినిధి ఎస్.సుధాకర్, హెచ్‌ఆర్‌ఎఫ్ ప్రతినిధి ఎం.శరత్, దళిత నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, ఆప్ జిల్లా మహిళా కన్వీనర్ డాక్టర్ సీతల్ పాల్గొన్నారు.

అత్యున్నత మేనేజ్‌మెంట్ విద్యే లక్ష్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ భారతదేశంలో అత్యున్నత స్థాయి మేనేజ్‌మెంట్ విద్యే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని బ్రదుక ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కిషన్ బ్రదుక తెలిపారు. శుక్రవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ 2030 నాటికి భారతదేశం ఏడు డాలర్ల ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థకు దక్షిణాది రాష్ట్రాల సహకారం 35 శాతం ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో కొత్తగా ప్రారంభించిన 'బ్రదుకా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్' ప్రపంచ స్థాయి మేనేజర్లను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉందన్నారు. 73 ఏళ్ల బ్రదుకా ఎడ్యుకేషనల్ సొసైటీ ఇటీవలే బ్రదుకా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (బిఎస్‌ఎం)ని ప్రారంభించిందన్నారు. ఎఐసిటిఇ ఆమోదించిన రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్‌ను కూడా ప్రవేశపెట్టిందన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో..

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సంక్రాంతి పండగ సందర్భంగా డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంక్రాంతి పోటీలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలకు ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం విద్యార్థులకు విచిత్ర వేషధారణ, సంక్రాంతి జానపద గీతాలపై పోటీలు చేపట్టారు. కార్యక్రమం అనంతరం విజ్ఞాన కేంద్రం బాధ్యులు విఎస్.పద్మనాభ రాజు, జిఎస్. రాజేశ్వరరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా రామలక్ష్మి, నాగలక్ష్మి వ్యవహరించారు. అల్లూరి సాంస్కృతిక విభాగం బాధ్యులు ఎల్లాజీ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



విజేతలు, పోటీల్లో పాల్గొన్న వారితో నిర్వాహకులు

అసాంఘిక చర్యలకు దిగితే కఠిన చర్యలు

సంక్రాంతి పండగలో అశాంతి సృష్టించవద్దు
- అనకాపల్లి ఎస్‌పి కెవి.మురళీకృష్ణ



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందాలు, పేకాట, బల్లాటలు వంటివి నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి కెవి.మురళీకృష్ణ హెచ్చరించారు. ఈ తరహా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పండగ సందర్భంగా స్థలాలు, భూములు ఇచ్చిన వ్యక్తులు, అశ్లీల నత్యాలు ప్రదర్శించిన వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతల సమస్యతో పాటు కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతినే అవకాశమున్నందున సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా వుండాలన్నారు. గతంలో పట్టుబడిన వారిపై బైండోవర్ చేయనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాల ప్రదేశాలు, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకుగానీ, డయల్ 100, 112 నెంబర్లకుగానీ ఫోన్ చేయాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా వుంచుతామన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

విశాఖ మార్కెట్‌లోకి ఇండియా ఆస్టర్

ఎంవిపి.కాలనీ : ప్రముఖ ఆటోమొబైల్ బ్రాండ్ మోరిస్ గెరేజెస్ (ఎంజి) తన నూతన ఎస్‌యువి వాహనం ఎంజి యాస్టర్ 2024ను శుక్రవారం ఉదయం బీచ్‌రోడ్‌లోని కాళీమాతా టెంపుల్ వద్ద ఉన్న షోరూమ్‌లో ఆవిష్కరించింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంజి మోటార్ ఇండియా, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కొత్త ఆస్టర్ 2024 అద్భుతమైన ఫీచర్లతో వస్తుందని తెలిపారు. ముందు వరుసలో వెంటిలేషన్ కలిగిన సీట్లు, వైర్‌లెస్ ఛార్జర్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో అండ్ ఆపిల్ కార్ ప్లే, అదనపు భద్రత కోసం ఆటో-డిమ్మింగ్ వంటివి ఉన్నాయన్నారు. ఐఆర్‌విఎం అధునాతన వినియోగదారు ఇంటర్‌ఫేస్‌తో అప్‌డేట్ చేయబడిన ఐ-ఎస్ఎంఎఆర్‌టి 2.0 సంపూర్ణ డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుందని అన్నారు. ఎఐ సాంకేతికత కలిగిన మొట్టమొదటి ఎస్‌యువి వాహనం ఇదని, ధర రూ.9,98,000తో ప్రారంభమవుతుందని తెలిపారు.

అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ విజేత విశాఖ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ విజేతగా విశాఖ బార్ అసోసియేషన్ జట్టు నిలిచింది. రాజమహేంద్రవరంలో ఈ నెల 8న విశాఖ, రాజమహేంద్రవరం జట్ల మధ్య జరిగిన ఫైనల్‌లో విశాఖ జట్టు 71 పరుగుల తేడాతో విజయం సాధించింది. నిర్ణీత 18 ఓవర్లలో విశాఖ జట్టు 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేయగా రాజమహేంద్రవరం జట్టు 18 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 88 పరుగులే చేసింది. విశాఖ జట్టులో న్యాయవాదులు అంతర్జాతీయ క్రికెట్ టోర్నీకి ప్రాతినిధ్యం వహించిన పక్కుర్తి సురేష్ కుమార్, చెన్నా సతీష్‌లు ఉండడం విశేషం.



ట్రోఫీతో విశాఖ జట్టు సభ్యులు

18వ వార్డులో కొనసాగిన ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జనంలో జనం కోసం పేరుతో తూర్పు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ చేపట్టిన పాదయాత్ర 20వ రోజుకు చేరుకుంది. శుక్రవారం కూడా 18వ వార్డులోనే యాత్ర సాగింది. 11 కిలోమీటర్ల మేర నిర్వహించారు. ఈ సందర్భంగా 18వ వార్డులో ఆయన గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పుక్కళ్ల ధనలక్ష్మి శంకర్, తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

స్వామీ వివేకానందుని జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పలు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. వివేకానందుని చిత్రపటాలకు, విగ్రహాలకు ఘననివాళులర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని, జాతీయ యువజన దినోత్సవ సంబరాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీధర్ పట్నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎఎస్‌సి. తేజస్విని కోనె స్వామి వివేకానంద గొప్పతనాన్ని వివరించారు. కళాశాల విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, చిత్రలేఖన, చదరంగం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

మధురవాడ : స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని మల్లువలస జగదీశ్వరరావు ఇంటి వద్ద వివేకానందుని విగ్రహానికి పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్ అధ్వర్యంలో ప్రవచనకర్త పెద్దాడ శ్రీరామమూర్తి నివాళులర్పించారు. వివేకానందుని చరిత్ర వివరించారు. పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి శ్రీపాద వెంకటరమణ, కోశాధికారి యస్ జగన్మోహన్‌చౌదరి, సలహాదారు డాక్టర్ ఎస్ రమేష్ , వై శంకరరావు, బెల్లపు పాపారావు, డాక్టర్ బిఎన్ రావు, బ్రిక్స్ శ్రీనివాస్, బయపల్లి సతీష్ కుమార్, దువ్వి కావ్య, ఎస్కె

వేణుగోపాల్, వెంకటేశ్వర నర్సింగ్ కాలేజీ కరస్పాండెంట్ నాయుడు, డిఆర్డిఏ ఏపీడి పాల్గొన్నారు.

గౌరీ గ్రంథాలయంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలను కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆఫ్ ఇండియా సీనియర్ ఆడిటర్ కెఎన్.రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో రాజు మాట్లాడుతూ యువతకు దేశభక్తి, సమాజ సేవలో స్వామి వివేకానంద ఆదర్శమన్నారు. విశాఖ యువ మహామండలి సభ్యులు డిఎన్.మూర్తి, ఎన్‌వైకె ప్రతినిధి కాండ్రేగుల వెంకటరమణ, గ్రంథాలయం ప్రతినిధులు కర్రి గంగాధర్, మళ్ల బాపునాయుడు, కర్రి హనుమంతరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక అయ్యన్న విద్యా సంస్థల ప్రాంగణంలో వివేకానందుని విగ్రహానికి ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం పూర్వ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు, ఆయన అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం పూల మాల నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అల్లు గౌరీ శంకర్, ఉపాధ్యాయులు డేవిడ్, రాజు, అప్పారావు, శ్రావణి, నాగ శిరీష పాల్గొన్నారు.

వివేకానందునికి ఘననివాళి



కె.కోటపాడులో నివాళులర్పిస్తున్న మాజీ విసి ముత్యాలనాయుడు



మధురవాడలో ...



వేపగుంట దరి నరవ విశాఖ ఇంజినీరింగ్ కాలేజీలో..

కరీమ్, సుబ్బరాజు పాల్గొన్నారు.

ఉక్కునగరం :శ్రీ హరిపురం స్వామి వివేకానంద హైస్కూల్ లో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆంధ్రయూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్. రామకృష్ణ పాల్గొని వివేకానందునికి నివాళులర్పించారు. విద్యార్థులలో మంచి ప్రవర్తన , క్రమశిక్షణ, దేశభక్తి కలిగి ఉండాలని ఆకాంక్షించారు విద్యాసంస్థల కరెస్పాండంట్ దాసరి మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ దాసరి రేణు, ప్రెసిడెంట్ దాసరి బోదిత్‌కృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లి :స్వామి వివేకానందుని బోధనలు విశ్వశాంతికి మార్గదర్శకాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో శ్రీవివేకానంద చారిటబుల్ ట్రస్ట్ సమావేశ మందిరంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, యువజన విభాగ అధ్యక్షులు జాజుల రమేష్ స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేశారు. హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ గిరీష్ కుమార్ కుమారుడు జలీత్ వేసిన వివేకానంద వేషం వేయగా, జలీత్‌కు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ జిల్లా మేనేజర్ చాముండేశ్వరరావు, జీవీఎంసీ ఏపీ డి దొరబాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ వీరు నాయుడు, డి

వడ్డాది : వడ్డాది ఎస్కెఏడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి స్వీట్స్ పంపిణీ చేశారు. లలిత వృద్ధాశ్రమంలో వృద్ధులకు వస్త్రాలు, వస్తువులు అందించారు. వైస్ ఎంపీపీ దొండా నారాయణమూర్తి సచివాలయ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు

మునగపాక : మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు 1992-93 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆళ్ల నాగేశ్వరరావు, అంగుళూరు రామకృష్ణ, వీర అప్పారావు, ఎంఎస్‌సి స్వామీజీ, శంకర్, జగన్నాథం, నాగమణి, వసంత, జగదీశ్వరి ప్రవీణ భారతి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం అవరణలో స్వామి వివేకానంద విగ్రహానిక టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు సిహెచ్ రమణ, ఎం సంజీవ కుమార్, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, గండిబోయిన పోలిరాజు పాల్గొన్నారు

భీమిలి మండలంలో..

భీమిలి మండలం, సింగనబంద గ్రామపంచాయతీ కృష్ణంరాజు పేట ప్రాథమికోన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. హెచ్‌ఎం జి సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

అచ్యుతాపురం : శ్రీస్వామి వివేకానంద జయంతి ఉత్సవ సందర్భంగా పూడిమడక గ్రామంలో శుక్రవారం వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ఆర్గనైజేషన్ అధ్యక్ష కార్యదర్శులు చోడిపల్లి అప్పారావు ఎం అప్పలనాయుడు చేతుల మీదుగా దుప్పట్ల పంపిణీ చేశారు. స్కూల్ పిల్లలకు బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో ఎం రవి ప్రసాద్, దాసరి శ్రీను, ఎం బాబు నాయుడు, చేపల కృష్ణ పాల్గొన్నారు. తిమ్మరాజుపేట గ్రామంలో వివేకానంద చిత్రపటానికి సిపిఎం నేతకర్రీ అప్పారావు, ఆడారి నర్సింగరావు పూలమాలలు వేశారు.

నక్కపల్లి:వివేకానందుని జీవితం నేటి యువతరానికి ఆదర్శమని ఎంఈఓ కె.నరేష్ అన్నారు. స్థానిక మానవవనరుల కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్. ఆచార్యులు ఆధ్వర్యంలో వివేకానందుని జయంతిని నిర్వహించారు. ముందుగా వివేకనందుని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నర్సీపట్నం టౌన్:యువత స్వామివివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ఉత్తరప్రదేశ్ సిబిసిఐడి అడిషనల్ డిజిపి కిల్లాడ సత్యనారాయణ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో జరిగిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. తాను పుట్టి పెరిగిన ప్రాంతమైన నర్సీపట్నం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. . ఈ గ్రంథాలయాధికారి దమయంతి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:మండలంలో రేవుపోలవరం గ్రామంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెరైన్ సిఐ నారిమణి, ఆంధ్రా మత్స్యకార జేఏసి అధ్యక్షుడు కంబాల అమ్మోరియ్యి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువతకు స్వామి వివేకానంద ఆదర్శమన్నారు. ముగ్గులు, వాలీబాల్ పోటీల విజేతలకు నగదు బహుమతులు అందచేశారు. ఎస్ఐ రమణ, అర్జిల్లి శ్రీను, ఎరిపల్లి ముసిలి, జామి మాధవ, జామి అప్పలరాజు పాల్గొన్నారు.

విశాఖపట్నం: భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాతగా స్వామి వివేకానంద నిలుస్తారని ఎయు ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.సమత అన్నారు. వివేకానంద జయంతి, యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయు ఇసి హాల్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఉర్దూ యూనివర్సిటీ విసి ఆచార్య రహమాన్, ఎయు ఓఎన్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్, ఎపి ఉన్నత విద్యమండలి సెక్రటరీ ఆహ్మాద్ నజీర్ పాల్గొన్నారు.



అనకాపల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపీ సత్యవతి



భీమిలిలో టిడిపి నాయకుల నివాళి



ఎయులో నివాళులర్పిస్తున్న విసి సమత, తదితరులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : పల్సర్ బైక్‌ను లారీ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన శుక్రవారం తెల్లవారు జామున జాతీయరహదారి విశాఖ వేలీ స్కూలు వెళ్ళే మలుపు వద్దచోటు చేసుకుంది. ట్రాఫిక్ సిఐ ప్రసాదు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం, మర్రిపాడు గ్రామానికి చెందిన జన్ని లోకనాధం(25), కూర్మనాధపురం మీనా(30) ఇద్దరూ చినగదిలి సమీపంలో ఒక గదిలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ వేర్వేరు చోట్ల కూలి పనులు చేసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం ఏడుగంటల సమయంలో మీనాను గుడ్లవానిపాలెంలో దింపేందుకు లోకనాథం పల్సర్ బైక్‌పై హనుమంతువాక నుంచి జూ పార్కు వైపు తీసుకెళుతుండగా, జాతీయరహదారి నుంచి విశాఖ వేలీ స్కూలు వైపు మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో ఇద్దరూ లారీ చక్రాల మధ్య పడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మీనాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎడిసిపి శ్రీనివాసరావు, సిఐ ప్రసాదు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో మరుపాక సమీపంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల పులుపును ధ్వంసం చేశామని స్థానిక ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పక్కాగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామని, అయితే ఆ ప్రదేశంలో ఎవరు లేకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలు చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో గొట్టువాడ గ్రామంలో పొలం పనుల నిమిత్తం పశువుల పాకలో విద్యుత్ బల్బు అమర్చుతూ ఉండగా విద్యుత్ షాకుకు గురై రాచపతి నాగేశ్వరరావు(45) అనే రైతు మృతి చెందాడు. విద్యుత్‌షాక్‌కు గురై అస్వస్థత పాలైన రైతు నాగేశ్వరరావును ఆసుపత్రికి తరలిస్తూ ఉండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై స్థానిక ఎస్ఐ రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

మహిళల ఆరోగ్యంపై సదస్సు

ప్రజాశక్తి -ములగాడ : మహిళల ఆరోగ్యం నీటి వనరులతో అనుసంధానమై ఉందని ఎయు ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషామాధురి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో 'ఆరోగ్యంలో వస్తున్న మార్పులు- చిరో ప్రాక్టిక్ థెరపీ' అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభించి, 'మహిళల ఆరోగ్యం- నీటి వనరులు' అంశంపై మాట్లాడారు. మహిళల ఆరోగ్యం, ఆనందం, ఆదాయం, కుటుంబ అనుబంధాలు నీటి వనరులతో ముడిపడి ఉన్నాయన్నారు. సదస్సులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చెందిన ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ దివ్య కిషోర్ మానసిక ఉద్రేకాలను సమర్థవంతంగా వినియోగిస్తే సామాజిక సంబంధాలు మెరుగు పడతాయన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ- వైద్యరంగంలో మార్పులు, నూతన ఆవిష్కరణలపై వివరించారు. అనంతరం 'హార్మోన్లపై వ్యాయామ ప్రభావం' అంశంపై డాక్టర్ సురేఖ, 'మానసిక ఆరోగ్యం'పై ఎ.రోజా మాట్లాడారు.. సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు జయశ్రీ, ప్రతిమ న్యూరో సైన్స్‌పై తమ అభిప్రాయాలను తెలిపారు. ఎన్‌సిసి సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎయు విద్యార్థులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన ఎయు ఎన్‌సిసి వలంటీర్లను ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.సమతఅభినందించారు. ఎయు పరిధిలోని జివిపి కళాశాల విద్యార్థిని జి.కావ్యదేవి, డాక్టర్ విఎస్ కృష్ణా కళాశాల విద్యార్థిని ఏ.చూడామణి, ఎయు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వి.రామరాజు, గాజువాక టిఎస్ఆర్-టిబికె డిగ్రీ కళాశాల విద్యార్థి వై.విశ్వమోహన్ జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొంటారు.

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాలి

- క్రైమ్ సిటీ డిసిపి వెంకటరత్నం



సిఐ, ఎస్ఐలకు సూచనలు చేస్తున్న క్రైం డిసిపి వెంకటరత్నం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రస్తుతం పండగ సందర్భంగా నేరాలు జరిగే అవకాశం ఉన్నందున, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నేర విభాగం విశాఖ సిటీ డిసిపి పి వెంకటరత్నం, స్థానిక నేర విభాగం పోలీసులను, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఆమె సందర్శించారు. నార్త్ సబ్ డివిజన్ సిఐ సురేష్, ఎస్ఐ ఎస్ సూర్యప్రకాశరావులకుపలు సూచనలు చేశారు. ఇటీవల తగరపువలస యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఓ ఇంట్లో మహిళ మెడలో ఉన్న బంగారు నగలను గుర్తు తెలియని మహిళ తెంచుకుపోయిన నేపథ్యంలో నేరస్థలాన్ని సందర్శించి, పరిశీలించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు గ్రంథాలయంవీధిలోని జివిఎంసి గ్రంథాలయానికి పౌరాణిక కళాకారులు ఉప్పాడ అప్పారావు తన సొంత నిధులతో సమకూర్చిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద జీవిత చరిత్రల పుస్తకాలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి తౌడు, బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు శ్రీధర్, పట్నాయక్, వెంకట శివ, కృష్ణవేణి పాల్గొన్నారు.

డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం డైరీ, కేలండర్‌ను శుక్రవారం ఎయులో ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య కె.సమత తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, విజిలెన్స్.మానిటరింగ్ కమిటీ సభ్యులు బోనెల ఏసుబాబు, కటికల కల్యాన, ఎయు ఆచార్యులు ఎన్ఎడి పాల్, ఆచార్య టి.సుబ్బారాయుడు పాల్గొన్నారు.

యల్లాప్రగడకు గీతంలో ఘన నివాళి



యల్లాప్రగడకు నివాళులర్పిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : ఔషధరంగంలో భారతదేశం గర్వించదగ్గ పరిశోధనలు చేసి ప్రజల జీవితాలలో కాపాడే మందులను కనుగొన్న డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు చిరస్మరణీయుడని గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్‌రంజన్ దాస్ అన్నారు. లో శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యం డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు 129వ జయంతిని పురస్కరించుకుని ఇనిస్టిట్యూట్ ఆవరణలోని డాక్టర్ సుబ్బారావు విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతదేశ ఔషధరంగం నుంచి ప్రాణాంతక వ్యాధులకు వ్యాక్సిన్స్, మందులను కనుగొనాల్సిన అవసరం ఉందని, దీనికి విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలకు మధ్య సంబంధాలు దోహదపడతాయన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ రానున్న రోజులలో దేశం గర్వించదగ్గ పరిశోధనలను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా గీతం ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాజా, ఫార్మసీ సీనియర్ ప్రొఫెసర్ పి.రామారావు యల్లాప్రగడ సుబ్బారావుకు నివాళులర్పించారు. ఫార్మస్యూటికల్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు

▸▸ భూముల ఆనవాళ్లు లేకుండా పోవడంపై రైతుల విస్మయం

▸▸ గుట్టుగా గ్రావెల్ తరలింపుతో మైదానంగా మారిన కొండ

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని ఎస్ఆర్ పురం గ్రామంలో అసైన్డ్ భూముల్లో గుట్టుగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపి, తరలింపుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సర్వే జరపడానికి వెళ్లి చూసేసరికి, అక్కడ భూములు ఆనవాళ్లు లేకుండా పోవడంపై విస్మయానికి గురయ్యారు. బాధ్యులను గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఎస్ఆర్.పురం సర్వే నంబర్ 100లో అసైన్డ్ భూముల సర్వే నిర్వహణకు శుక్రవారం అధికారులతో కలిసి అక్కడకు వెళ్లిన రైతులు విస్మయానికి గురయ్యారు. తమ భూములు ఎక్కడున్నాయని గుర్తించలేక అయోమయానికి గురయ్యారు. ఎపుడో సీజన్‌లో ఫలసాయాన్ని తీసుకునేందుకు తర్వాత మిగతా ఏడాది పొడుగునా అటువైపు వచ్చే పనిలేదని, తీరా ఇపుడువచ్చి చూసే సరికి భూములు ఆనవాళ్లు లేకుండా పోయాయని అవాక్కయ్యారు. కొండలు, గుట్టలుగా ఉండాల్సిన భూమిలోని మట్టినంతా తవ్వి తరలించే సరికి ఇపుడు ఏకంగా మైదాన ప్రాంతంగా మారిపోయిందని, ఇపుడు ఎవరి భూమి ఎక్కడ ఉందో తెలుసుకోవడం కష్టమేనని అంటున్నారు. మట్టి తరలింపు వరకు సరే, ఎవరైనా తమ భూమిని లాక్కొంటే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు.



అక్రమ మట్టి తవ్వకాలతో చదునుగా మారిన కొండ


అసైన్డ్ భూముల్లోని మట్టిని, గ్రావెల్‌ను తవ్వి తరలించిన వ్యవహారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లక్షలు విలువ చేయడంతోపాటు రైతులకు, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ మట్టిమాఫియా చేసిన ఈ దౌర్జన్యం, అక్రమంపై ఆవేదన చెందుతున్నారు. నిరుపేద లెవరైనా చిన్న పూరిపాక వేసుకుంటే ఆగమేఘాల మీద వాలిపోయి, తొలగించే వరకు వదలకుండా చర్యలు చేపట్టే అధికార యంత్రాంగానికి ఇంతటి భారీ అక్రమం రెవెన్యూ, సచివాలయ యంత్రాంగానికి తెలియకుండా జరగదని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆక్రమిత ప్రభుత్వ భూములపై హక్కులు

◆ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

◆ జిఒ 301, 388 పట్టాదారులకు టైటిల్ డీడ్స్

◆ ల్యాండ్ టైటలింగ్ చట్టంపై ఆందోళన వద్దని సూచన



పట్టాలు అందజేస్తున్న రెవెన్యూమంత్రి ధర్మాన, వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- గాజువాక : ఆక్రమిత ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చారిత్రాత్మక నిర్ణయమని, ప్రజలకు భూమిపై సంపూర్ణ హక్కును ప్రభుత్వం కల్పించిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శుక్రవారం గాజువాక బిసి రోడ్డులో స్టీల్‌ప్లాంట్, ఫార్మాసిటీ భూనిర్వాసితులకు ఇళ్లపట్టాలను, జిఒ 301, 388 పట్టాదారులకు టైటిల్ డీడ్స్‌ను వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డితో కలిసి అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్లస్థలాలు, శాశ్వత భూమి పట్టాలు అందించి, ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ల్యాండ్ టైటలింగ్ చట్టంపై ఆందోళన వద్దని,అనేక అధ్యయనాలు తరువాత భావితరాలకు భూమిపై సంపూర్ణ హక్కులు కోసం చేపట్టామని వివరించారు.రాష్ట్రంలో 17వేల గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల అప్‌డేషన్, సర్వే జరుగుతోందని, ఇది పూర్తయ్యాక చట్టం నోటిపై చేస్తామన్నారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూగాజువాక హౌసింగ్ సొసైటీ పరిధిలో 7026మందికి, జిల్లా వ్యాప్తంగా 6260 మంది ఆక్రమిత ప్రభుత్వ భూములలో నివాసముంటున్న వారికి కన్వేయన్స్ డీడ్స్ అందిస్తున్నామన్నారు. 39 మంది ఉక్కు నిర్వాసితులకు కన్వేయన్స్ పట్టాలు, 40 మంది ఫార్మాసిటీ భూనిర్వాసితులకు ఇండ్ల పట్టాల పంపిణీ చేస్తున్నామన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న గాజువాక హౌసింగ్ సొసైటీ భూములకు శాశ్వత పరిష్కారం చూపడం ద్వారా ముఖ్యమంత్రి జగన్, రూ.1500కోట్ల విలువైన భూమిపై ప్రజలకు శాశ్వత హక్కులను కల్పించారన్నారుకార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజు, జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ పల్లా చినతల్లి, గాజువాక వైసిపి ఇన్‌ఛార్జి ఊరుకూటి రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరమణ, ఆర్‌డిఓ హుస్సేన్ సాహెబ్, కార్పొరేటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి 31లోగా దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్ల (న్యాయ సహాయకులు) నియామకానికి ఈనెల 31లోగా ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ ప్రకటనలోతెలిపారు. సంస్థ అధ్యక్షులు ఆలపాటి గిరిధర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రజలకు న్యాయ సలహాలతోపాటు న్యాయసాయం చేసేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, వివిధ సేవాసంస్థల్లో పనిచేసినవారికి ప్రాధాన్యత ఉంటుందని, అభ్యర్థులు దరఖాస్తుతోపాటుఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు, పాస్‌పోర్టుసైజ్, స్టాంప్‌సైజ్ ఫొటోతో విశాఖ జిల్లా కోర్టులోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులను ఏడాది కాలానికి నియమిస్తామని,వారి ఎటువంటి వేతనం, పారితోషికం ఉండదని గుర్తించాలన్నారు.

30న గీతంలో ఎడ్యూత్ మీట్

- 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకులు రవిశంకర్ రాక

ప్రజాశక్తి -మధురవాడ : సమాజంలో మానవత విలువలను పెంచడానికి 'కలిసి నడుద్దాం, కలిసి ఎదుగుదాం, ముందుకు సాగుదాం' నినాదంతో పాటు మత్తు మందుల వినియోగానికి వ్యతిరేకంగా యువత ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం,ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక సంస్థ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 30న ఎడుయూత్ మీట్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ రవిశంకర్ హాజరుకానున్నారు. యువతను ఉత్తేజపరిచే విధంగా, దేశభక్తిని ప్రబోధిస్తూ ధ్యానమార్గం, ఏకాగ్రత, జీవిత సూత్రాలను ప్రబోధించనున్నారు. అలాగే సాంస్కృతిక ప్రదర్శనలును ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి నగరంలోని కళాశాలల విద్యార్థులను ఆహ్వానిస్తూ నిర్వహక కమిటీ ముందస్తు సన్నాహాలను ప్రారంభించింది.

విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహిస్తున్నారు. పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం లో పాల్గొనదలిచిన విద్యార్థులు ఎడుయూత్‌మీట్.కామ్ ద్వారా ఉచితంగా పాసులను పొందవచ్చు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేస్తామన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో పూణేలోని సావిత్రిబాయ్ పూలే విశ్వవిద్యాలయంలో మొదటి సారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి లక్షా యాభైవేల మంది విద్యార్థులు హాజరయ్యారని నిర్వహకులు తెలిపారు.

జనసేన మండల అధ్యక్షునిగా రామస్వామి

ప్రజాశక్తి -పద్మనాభం : జనసేన పార్టీ మండల అధ్యక్షులుగా రామస్వామినాయుడును నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్రకార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. తనను పార్టీ మండల అధ్యక్షునిగా నియమించిన అధినేత పవన్ కల్యాణ్, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పంచకర్ల నాగ సందీప్‌కు కృతజ్ఞతలు.తెలిపారు. అలాగే మండల నాయకులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. అందరి సమిష్టి సహకారంతోపార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ కేడర్‌కు, ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రానికి, ప్రజలకు మంచి రోజులు రానున్నాయని ఆకాంక్షించారు. మండల నాయకులు సంతోష్ తదితరులు ఉన్నారు.

సోషల్ ఇంక్యుబేషన్ కేంద్రంతో ఖైదీలకు మేలు

- జైళ్లశాఖ రాష్ట్ర ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : జైల్లోని ఖైదీల మేలు కోసమే సోషల్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు జైళ్ల శాఖ రాష్ట్ర ఐజి ఇండ్ల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం విశాఖ కేంద్రకారాగారాన్ని డిఐజి రవికిరణ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జైల్లో ఖైదీల బేరక్‌లను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి భోజనం, వైద్యం, వసతి సౌకర్యాలపై ఆరా తీసారు. అనంతరం ఇటీవల ఏర్పాటు చేసిన సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ సభ్యులు, సామాజిక కార్యకర్తలు, వైద్యులు, బ్యాంక్ అధికారులు, లాయర్లుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా జైల్లోని ఖైదీల మానసిక పరిస్థితి గమనించి, వారిలో మార్పు తీసుకురావడం, వారు బయటకు వెళ్లేటప్పుడు తిరిగి నేరాలకు పాల్పడకుండా కుటుంబాలతో సంతోషంగా ఉండేలా వారిలో పరివర్తన తీసుకురావడం వంటివి సోషల్ ఇంక్యుబేషన్ కేంద్రం లక్ష్యమన్నారు. ఖైదీలు, వారి కుటుంబసభ్యుల సంక్షేమమే ప్రధానలక్ష్యంగా పనిచేయాలని ఇంక్యుబేషన్ సెంటర్ సభ్యులను ఐజి ఇండ్ల శ్రీనివాసరావు సూచించారు. సమావేశంలో జైలు పర్యవేక్షణాధికారి



మాట్లాడుతున్న జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు

కిషోర్ కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్స్ రామచంద్రరావు, కమలాకరరావు పాల్గొన్నారు.

పలుచోట్ల సందడిగా సంక్రాంతి సంబరాలు



డైట్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న రత్నాకర్ దంపతులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో పల్లె వాతావరణాన్ని తలపించేలా నిర్మించిన తాటాకు ఇళ్లు, ఎద్దుల బండి, గంగిరెద్దుల వేషధారణలు, హరిదాసుల వేషధారణలు, బొమ్మల కొలువు, పాడి, పంటల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహపూరిత పాటలు, నృత్యాల నడుమ భోగి మంటలు, పలు రకాల సాంప్రదాయ పిండి వంటల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలతో పండగ శోభ సంతరించుకుంది. విద్యార్థులకు రంగవల్లులు, పిండివంటల తయారీ, గాలిపటాలు, స్లో సైక్లింగ్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు, దాడి పద్మావతి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల వారి విన్యాసాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.సుజాత, డీన్స్ కె.ఈశ్వరరావు, కృష్ణనాగ్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గొన్న కళాశాలలో...

పరవాడ : మండలంలోని ఏడుమెట్ల మర్రిపాలెం గొన్న కళాశాలలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం అంబరాన్ని అంటాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రంగోలి, బోగీ మంటలు, పొంగలి తయారీ, తీన్మార్, డీజే, కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హెమ్‌చంద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాధవధారలో...

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలోఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగురంగుల రంగవల్లులతో వేదికను అందంగా తీర్చిదిద్ది, చెరకుగడలు, గొబ్బెమ్మలతో అలంకరించి భోగీమంటలు వేశారు. గంగిరెద్దులు, గాలిపటాలు, హరిదాసుల సందడితో సంప్రదాయ పద్ధతిలో గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా సంబరాలు నిర్వహించారు. పార్టీ శ్రేణులకు, సచివాలయం సిబ్బందికి, వాలంటీర్లకు సంక్రాంతి కానుకగా నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు, వికెపిసిపిఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాధం, సనపల చంద్రమౌళి, జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్,ౕ ంయ్యి వెంకటరమణ, కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు, బర్కత్ అలీ, కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, రాష్ట్ర నాయకులు కాశీవిశ్వనాధ్, పేడాడ రమణి కుమారి, వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, కె.పి రత్నాకర్, పి.సునీత, జిల్లా నాయకులు ఆళ్ల శివ గణేష్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు

తగరపువలస : జివిఎంసి ఒకటోవార్డు చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రాము నాయుడు ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాల్లో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.భోగి మంటలు వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

జనసేన ఆధ్వర్యాన...

జివిఎంసి ఒకటో వార్డు జనసేన అధ్యక్షులు పరిమి భువనేశ్వరి ఆధ్వర్యాన చిట్టివలసలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించగా, విజేతలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ బహుమతులు అందజేశారు

స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివి సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

నరకాసురుని సాగనంపిన తర్వాతే నిజమైన సంక్రాంతి

వేపగుంట : నరకాసురుడు లాంటి జగన్‌ను ఇంటికి సాగనంపిన తర్వాతే రాష్ట్రప్రజలకు నిజమైన సంక్రాంతి అని, అపుడే ఆనందంగా పండుగను జరుపుకుందామని విశాఖ ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. 94వ వార్డు వేపకుంటలో జనసేన ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. జనసేన నాయకులు బొడ్డేటి రఘు, వార్డు అధ్యక్షులు పిన్నింటి పార్వతి, సోమశేఖర్ నాయుడు, మధు, చైతన్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు

సినర్జీస్‌లో ....

ఉక్కునగరం : భోగిమంటలు, గొబ్బెమ్మలు, పొంగలి, చెరకు గడలు, రంగవల్లులు,హరిదాసు, కొళాటం ఆటలతొ దువ్వాడ విఎస్ఇజెడ్‌లోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీలో సంక్రాంతి పండగను జరుపుకున్నారు. ఉద్యోగస్థుల కుటుంబ సభ్యులందరూ సంప్రదాయ దుస్తులు, పల్లె అందాలను గుర్తుకు తెచ్చేలా వేషధారణలతో అలరించారు. కార్మిక కుటుంబసభ్యులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కంపెనీ ప్రెసిడెంట్ శేఖర్ మువ్వా విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్‌ప్రెసిడెంట్ బియస్‌ఎన్.రాజు పాల్గొన్నారు.



సినర్జీస్‌లో సంప్రదాయబద్ధంగా పాలు పొంగిస్తున్న దృశ్యం

19లోగా సమాధానం ఇవ్వకుంటే చర్యలు

- అంగన్వాడీలకు ఐసిడిఎస్ సిడిపిఒ హెచ్చరిక

ప్రజాశక్తి-దేవరాపల్లి : అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు షోకాజు నోటీసులు ఇంటికి అతికించడం జరుగుతుందని, ఆ నోటీసులకు ఈ నెల 19వ తేదీ లోపు సమాధానం తెలియజేసి, విధిగా తమ ఉద్యోగ కార్యకలాపాలను సాగించాలని, లేనిచో జిల్లా కలెక్టర్, ఐసిడిఎస్ పిఒ, అంగన్వాడీ కార్యకర్తల సహాయకుల జిల్లా ఎంపిక కమిటీ వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోబడతాయని కె.కోటపాడు ఐసిడిఎస్ సిడిపిఒ వి.మంగతాయారు హెచ్చరించారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవరాపల్లి మండల కేంద్రంలోని వీఆర్వో ఝాన్సీ, మహిళా పోలీస్ సంధ్య, అంగన్వాడి సూపర్వైజర్ ఎం. రాములమ్మ ఈ నోటీసులను అంగన్వాడీ సిబ్బంది ఇళ్లకు, స్థానిక సచివాలయానికి, అంగన్వాడి కేంద్రాల్లో ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ నోటీసులకు సమాధానం తెలుపకుంటే ప్రభుత్వం తీసుకున్న చర్యలకు కట్టుబడాల్సిందేనని మంగతాయారు హెచ్చరించారు.

హాస్టల్ అభివృద్ధికి రూ.15 లక్షల సిఎస్‌ఆర్ నిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి : కసింకోట బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో గదులు, బాత్రూములు, స్టడీ రూమ్ మరమ్మత్తులు, పెయింటింగ్ నిమిత్తం చెట్టినాడు సిమెంట్ కార్పొరేషన్ తమ వంతు సామాజిక బాధ్యతగా సిఎస్‌ఆర్ నిధుల నుండి రూ.15 లక్షలు మంజూరు చేసింది. సంస్థకు చెందిన ఏజీఎం(హెచ్ ఆర్) నరసింహారాజు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టికి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో చెక్కును అందజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెట్టినాడ్ కంపెనీ సిఎస్సార్ నిధులను సమకూర్చినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కే. రాజేశ్వరి, కంపెనీ ప్రతినిధులు ధనంజయ్, కృపానందం పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత సీతయ్యపేట

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని సీతయ్యపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. తైపురం- సీతయ్యపేట జట్ల మధ్య జరిగిన ఈ పోటీలో సీతయ్యపేట జట్టు విజయ సాధించింది. పలు గ్రామాల్లోనూ ఆటల పోటీలు జరిగాయి.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని పెద్దలు చెప్పినట్టు ప్రతి ఒక్కరు తమ కళ్ళను పరిరక్షించుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి వి కే జగన్నాథరావు అన్నారు. ఆర్ ఏ ఆర్ ఎస్ లో శుక్రవారం లారెన్స్ మాయో సంస్థ సహకారంతో ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది పాల్గొన్న ఈ శిబిరంలో పదిమంది క్యాటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపికయ్యారు. అలాగే మిగిలిన వారికి వైద్య పరీక్షలు జరిపి అవసరమైన మందులు అందజేశారు. శిబిరంలో లారెన్స్ అండ్ మాయో సంస్థల ప్రతినిధులు దేవనాద్ గంగూలి, ఆకాష్కుందు సిహెచ్ జనార్ధన్ రావు, సాయి శివమూర్తి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, కెవి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కైట్స్‌లో ఫేర్‌వెల్ డే వేడుకలు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : స్థానిక కైట్స్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలల ఫేర్‌వెల్ డే వేడుకలు కళాశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకర్షించాయి. కళాశాలలో జరిగిన మధుర స్మృతులు ఒకరికొకరు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాలేజ్ కరెస్పాండెంట్ రెడ్డి చిరంజీవి మాట్లాడుతూ జీవితంలో మంచిగా స్థిరపడి తల్లిదండ్రులకు, కాలేజ్‌కి మంచి పేరు తీసుకురావాలని కోరారు. చదువుతూ యూటూబ్ ఛానల్, ఇన్స్టాగ్రామ్ రీల్స్ ద్వారా ఆదాయం పొందుతున్న విదార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆడారి అప్పలనాయుడు, కైట్స్ స్కూల్ కరెస్పాండెంట్ రెడ్డి గణేష్ , డైరెక్టర్స్ ఆడారి సన్యాసిరావు, అడిగర్ల శంకరరావు, విల్లూరి ప్రసాద్, సరిసా నాగేశ్వరరావు అధ్యాపకులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల గ్రామంలో హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు శుక్రవారం డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు చేతుల మీదుగా సంక్రాంతి బోనస్ పంపిణీ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా 26 మంది పాడి రైతులకు రెండు లక్షల 15 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన హెరిటేజ్ డెయిరీ తరపున పాడి రైతులకు అమలు జరుపుతున్న పలు పథకాలను వైద్య సేవలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బి. జగ్గారావు, బి.ప్రకాశరావు, కుమార్, కె.శ్రీను, జి రమణాజీ, బి.శివ, డి ఆదినారాయణ, మంగ, వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

16న బౌద్ధ మేళాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రముఖ బౌద్ధ పర్యాటక కేంద్రం బొజ్జన్న కొండ వద్ద ఈనెల 16న జరిగే "బౌద్ధ మేళా"ను విజయవంతం చేయాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి కోరారు. బౌద్ధ మేళ కరపత్రాన్ని శుక్రవారం సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చ రల్ అసోసియేష న్ అధ్యక్షులు, విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆర్గ నైజింగ్ ప్రచార కార్యదర్శి బల్ల నాగభూషణం తదితరులతో కలిసి ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ అత్యంత పురాతన బౌద్ధ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ప్రతీ ఏటా కనుమ పండుగ నాడు మహా జాతర జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా దేశ,విదేశీ బౌద్ధ భిక్షువులు ముఖ్య అతిధులుగా పాల్గొని ఎంతో ప్రతిష్ఠాత్మకముగా నిర్వహించడం ఎంతో అభినందనందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు వినకోట నీలేశ్ గుప్తా, కార్యవర్గ సభ్యులు కొత్తూర్తి రామారావు, బుద్ధిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షులు నేల పూడి బాల రాజు, లీగల్ అడ్వైజర్ గిలకల అప్పారావు పాల్గొన్నారు..

ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఉప ఖజానాల పరిధిలోనున్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్స్) ఫిబ్రవరి 29 వరకు స్వీకరిస్తామని జిల్లా ఖజానా అధికారి వి లక్ష్మీ సుభాషిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన, నాన్-ఎంప్లాయ్మెంట్ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ పింఛను దారులు జీవన ధ్రువీకరణ నాన్- ఎంప్లాయిమెంట్ లతోపాటు నాన్- రీమ్యారేజ్ ధ్రువీకరణ పత్రాలు కూడా జత చేయాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు ఉపఖజానాలు మీసేవ కేంద్రాలు ఇంటర్నెట్ కేంద్రాలు పోస్టల ద్వారా అందజేయ వలసిందిగా కోరారు. సకాలంలో అందజేయకపోతే ఏప్రిల్ నెల పించను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు మరింత విస్తృతం

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో కార్మికులు, నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టంశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కోఆర్డినేషన్ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులను ఉపయోగించుకుంటున్న అన్ని శాఖల వారి నుండి కార్మిక సెస్ వసూలు చేయాలన్నారు. అదేవిధంగా నిర్మాణాలకు సంబంధించి పని ప్రారంభించక ముందే సెస్ కట్టించుకోవాలన్నారు. భవనాలు కట్టడాల నిర్మాణాలను ముందుగానే రిజిస్టర్ చేయించాలని సూచించారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించి ఏమైనా బిల్లులు పెండింగ్ ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వసంతరావు, సోషల్ సెక్యూరిటీ అధికారిణి పి. సుజాత, గహ నిర్మాణ శాఖ ఎస్ డి సి కే. రమాదేవి, డ్వామా పిడి ఈ. సందీప్, జీవీఎంసీ జెడ్.సి. వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, పరిశ్రమల శాఖ ఏడి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : కలెక్టర్

అనకాపల్లి : జిల్లాలో క్రీడల అభివద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టణ శెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల బాలికలు యువతీ యువకులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, పవర్ లిఫ్టర్ కుసుమ, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఈవో మహాలక్ష్మమ్మ, డిపిఒ ఆర్ శిరీష రాణి, ఏపీఐఐసీ జెడ్.ఎం త్రినాథ్, పిఆర్ ఏఈ వీరు నాయుడు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, డిఎస్‌డిఓ ఎల్ వి రమణ, జెడ్ పి ఏఓ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.21.56 లక్షలు పంట నష్టం మంజూరు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఇటీవల వచ్చిన తుపాను ప్రభావంతో కె.కోటపాడు మండలంలో 320 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, 724 మంది రైతులకు 21.56 లక్షల రూపాయలు పంట నష్టం ప్రభుత్వం నుండి మంజూరైందని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడివో సమావేశ మందిరంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు లెక్కల నాగ విజయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వచ్చేయన్నారు. మండలంలో మేడిచర్ల, సింగన్నదొరపాలెం, చౌడువాడ , కే కోటపాడు గ్రామాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటివరకు 750 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. చౌడువాడ పశు వైద్యాధికారి డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ఆడ పెయ్యిల పథకానికి 850 రూపాయలు సబ్సిడీ ఉందని, రైతులు కేవలం 500 రూపాయలు చెల్లిస్తే చాలని చెప్పారు. పశు బీమా పథకానికి రూ.400 చెల్లిస్తే మూడు సంవత్సరాల కాల పరిమితిలో ఉంటుందన్నారు. చౌడువాడ ఎంపిటిసి రాజేష్ మాట్లాడుతూ ఈనెల కోటాలో కందిపప్పు శనగపప్పు పూర్తిస్థాయిలో ప్రజలకు అందలేదని, ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిటిసిలు వర్రి రామనాయుడు, రొంగలి సూర్యనారాయణ, ఎంపిడివో ప్రసాద్ , తహసీల్దార్ రమేష్ బాబు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దారు రమేష్‌బాబు

అచ్యుతాపురంలో స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎలమంచిలి, పూడిమడక, గాజువాక రహదారులపై భారీ వాహనాలు బారులు తీరి నిలిచి పోయాయి. జంక్షన్లో ఎలమంచిలి రహదారిలో భారీ వాహనం ఇంజిన్ రిపేర్‌తో నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది. శుక్రవారం సంతలో కార్లు వ్యాన్లో రాకపోకలు సాగించడంతో కొనుగోలుదారులు, చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. పంచాయతీకి ఆశీలు కడుతున్నప్పటికీ తమకు సౌకర్యాలను పంచాయతీ కల్పించడం లేదని వ్యాపారస్తులు చెబుతున్నారు.

14న గాలిపటాల పోటీలు

ప్రజాశక్తి- మునగపాక : సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని ఈనెల 14వ తేదీ భోగి పండుగ రోజున స్థానిక బైపాస్ రోడ్‌లో గౌరీ యూత్, సంత బయలు యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గాలి పటాల పోటీలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తెలియజేశారు. ఆసక్తి కలవారు ఎంట్రీ ఫీజు రూ.20లు చెల్లించి పోటీలలో పాల్గొన వచ్చుని పేర్కొన్నారు.

రైతులకు మోటార్లు పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : జలకళ పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన మోటార్లను రైతులకు స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జలకళ పథకంలో భాగంగా వ్యవసాయ బోరుబావులను గతంలో తీశారు. ఈ రైతులకు అవసరమైన సామగ్రిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : విజయవాడలో భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ స్మృతి వనం, 125 అడుగుల ఎత్తైన విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంపై మండలంలోని ఆదిరెడ్డిపాలెం, సబ్బవరం-2 సచివాలయంలో శుక్రవారం సంతకాల సేకరణ జరిగింది. అనకాపల్లి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ గొంప దేముడు ముఖ్య అతిథిగా పాల్గొని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ సంతకాలు చేసి మద్దతు పలకడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ షేక్ మనీషా, డిజిటల్ అసిస్టెంట్ దిలీప్ ,వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేష్ ,మహిళా పోలీసు భారతి, సచివాలయం సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : జగన్ ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యాన దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల ఆటో కార్మికులు దేవరాపల్లి నుండి కె.కోటపాడు వరకు ర్యాలీ నిర్వహించారు. దీనికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించి, ఆటో ర్యాలీ ఉపముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, లలిత నాయుడు, చల్లా తాతయ్యలు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ, దేవరాపల్లి, గరిశింగి, ఏ.కొత్తపల్లి, ముషిడిపల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించిన తారు రోడ్లు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్నెస్ సెంటర్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం దేవరాపల్లిలోని రాజుల వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అంతకుముందు భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, వైసిపి నాయకులు కిలపర్తి భాస్కరరావు, బూరె బాబురావు, కర్రి సూరినాయుడు, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, లలిత నాయుడు, కె.వి.రమణ, వి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సింహాచలానికి కాలినడకన పయనం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు సింహాచలం వరాహ నరసింహస్వామి మాలధారణ చేపట్టి 42 రోజులు పాటు భక్తిశ్రద్ధలతో దీక్షలను, పూజలను ముగించిన సందర్భంగా శుక్రవారం గ్రామం నుండి మాలా విసర్జన చేసేందుకు కాలినడకన సింహాచలం పయనించారు. వీరికి గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, గ్రామ పెద్దలు సాగనంపారు. కార్యక్రమంలో కసుమ నాయుడు, అప్పలనాయుడుపాల్గొన్నారు.

20న వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి
ఉత్తరాంధ్రలోని పేరుగాంచిన వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఈ నెల 20న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వాకాడ బాబు, మద్దాల నూకరాజు, ఉపాధ్యక్షులు సీరంశెట్టి నరసింగరావు, సహాయ కార్యదర్శి పసన శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా శుక్రవారం వేల్పుల వీధి శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం, జార్జ్ క్లబ్ వద్ద డాన్స్ షో, పూడిమడక రోడ్డు హాస్పిటల్ వద్ద ధమాకా డాన్స్ నైట్, ఎన్టీఆర్ స్టేడియం వద్ద డాన్స్ హంగామా ఎమ్మెస్ రావు షాపు వద్ద మ్యూజికల్ నైట్ షో, రామచంద్ర థియేటర్ వద్ద డాన్స్ కార్యక్రమం, సత్యదేవ హాస్పిటల్ ఆధ్వర్యంలో పూడిమడక రోడ్డు రామాలయం వద్ద డాన్స్ హంగామా, శారద బ్రిడ్జి వద్ద డూప్స్ బాబోయ్ డూప్స్ విజయనగరం వారిచే కార్యక్రమం, గాజువాక బస్టాండ్ వద్ద శ్రీ కళామతల్లి బుర్రకథ, రాతి మేడ వద్ద బాలనాగమ్మ బుర్రకథ, చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద విజయనగరం వారిచే రేలారే లేరా డాన్స్ కార్యక్రమం, జీవీఎంసీ ఆఫీస్ వద్ద పాడుతా తీయగా ఆర్కెస్ట్రా కార్యక్రమం, వేపగుంట వారిచే తీన్మార్ డాన్స్ కార్యక్రమం, రాతి మేడ వద్ద బుర్రకథ, జీవీఎంసీ ఆఫీస్ వద్ద పాడుతా తీయగా ఆర్కెస్ట్రా, కేరళ డబ్బులు డాన్స్, విశాఖపట్నం జాలరి పేట వారిచే దాండియా డాన్స్, విజయనగరం వారిచే భయంకర పులి వేషాలు, తప్పెడుగులు పొడుగు కాళ్ల మనుషుల డాన్స్, కోయ వేషాలు, కోలాటం ఆటలు, దాండియా డాన్స్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వీధి పెద్దలు దోమదౌతు రామారావు, మద్దాల కూర్మారావు, ముత్త ఈశ్వరరావు మద్దాల రమణబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో నాటుకోళ్లకు గిరాకీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సంక్రాంతి పండగ సందర్భంగా అచ్యుతాపురంలో శుక్రవారం జరిగిన వారపు సంతలో నాటు కోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. ప్రధానంగా కోడి పుంజులకు మరింత గిరాకీ ఎక్కువగా ఉంది. జిల్లా నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో కొనుగోలుదారులు వచ్చి నాటు కోళ్లను కొనటానికి పోటీపడ్డారు. కొనుగోలుదారుల సంఖ్య పెరగడంతో కోళ్ల అమ్మకందారులు రేట్లు అధికంగా పెంచి విక్రయించారు. పండగ సందర్భంగా కనుమ, ముక్కు కనుమ రోజున నాటుకోడి తినాలని అభిలాషించే వారంతా కోడి ధరతో సంబంధం లేకుండా పోటీపడి కొనుగోలు చేశారు. ఈ విధంగా సంత రోజున లక్షలాది రూపాయలు విలువ చేసే కోళ్ళ అమ్మకాలు సాగాయి. అచ్యుతాపురం మండలం పరిధిలో ఉన్న గ్రామాల నుంచి గంపలు, ఆటోలపై కోళ్ళ తీసుకువచ్చారు. విశాఖ టౌను, గాజువాక, స్టీల్ ప్లాంట్ ప్రాంతాల నుండి వచ్చి పెద్ద సంఖ్యలో కొనుగోలు చేశారు. అలాగే నూతన దుస్తులు, నిత్యావసరాలు కొనుగోలు జరిగాయి.

ఆర్థిక సంఘం నిధులు దారిమళ్లిస్తే ఆందోళన

ప్రజాశక్తి-పరవాడ : కేంద్రం ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన రూ.988 కోట్లలో రూ.600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దొంగలించాలని చూస్తోందని, అదే చేస్తే ఆందోళన చేస్తామని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్స్ ఉపాధ్యక్షులు చింతకాయల ముత్యాలు హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో ఆ నిధులు జమ చేయాలని, లేకుంటే రాజకీయాలకతీతంగా సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలతో కలిసి తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-23వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండవ విడత నిధులు రూ.988 కోట్లు తాజాగా 4 రోజుల క్రితం పంపించిందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 393 కోట్ల రూపాయలు మాత్రమే గ్రామ పంచాయతీ, పిఎఫ్ఎమ్ ఎస్ ఖాతాల్లో జమ చేసిందని, మిగిలిన 600 కోట్లు పంచాయతీలకు ఇవ్వకుండా దారి మళ్లించిందని ఆరోపించారు. గతంలో కూడా ఇదే విధంగా రూ.8629 కోట్లు దారి మళ్లించిన విషయాన్ని గుర్తు చేశారు.

బకాయి జీతాలు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి-సబ్బవరం : గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన సబ్బవరం మెయిన్ రోడ్డుపై శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, ఎలక్ట్రీషన్లు అనేక సంవత్సరాలుగా చాలీచాలని జీతంతో జీవిస్తున్నారన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు 3 నెలలుగా జీతాలు రాక వీరి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ విధానం రద్దు చేసి ప్రభుత్వం నేరుగా జీతం చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి పనిముట్లు, సబ్బులు, గ్లౌజులు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెంటారావు, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

ప్రజాశక్తి-మునగపాక : వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ సుందరపు విజయ్ కుమార్ ధ్వజమెత్తారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో రాక్షసపాలన నడుస్తుందన్నారు. తమ సొంత వ్యాపారాలు చక్కదిద్దుకునే పరిస్థితుల్లో ప్రజా ప్రతినిధులు ఉన్నారని ఆరోపించారు. నియోజవర్గంలో రోడ్ల పరిస్థితి అయోమయంగా ఉన్నాయని, స్థానిక ఎమ్మెల్యే నిద్రపోతున్న పరిస్థితి కనబడుతుందని మండిపడ్డారు. ఈ సందర్భంగా మునగపాక మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షులుగా టెక్కలి పరశురాం, ప్రధాన కార్యదర్శిగా కె.చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా పాలపీని రాము, మొల్లేటి ఆనంద్, కోశాధికారిగా ఎల్లపు సంతోష్, అధికార ప్రతినిధిగా ఎల్లపు హేమ నాయుడు, కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆడారి శ్రీకాంత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏవి సత్యనారాయణ, సరోజినీ, వాసు, సూరిశెట్టి అప్పలనాయుడు, కోరుకొండ కాశీ తదితరులు పాల్గొన్నారు.

అశ్లీల, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : సంక్రాంతి పండగ సందర్భంగా అశ్లీల, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని బుచ్చయ్యపేట ఎస్ఐ డి ఈశ్వరరావు అన్నారు. కోడి పందాలు, గుల్లాటలు ఆడటం, జాతరల్లో అశ్లీల నృత్యాలు, అశ్లీల పాటలు ప్రదర్శించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తమ బంగారం, వెండి వస్తువులను జాగ్రత్తపరచుకోవాలని, ఎక్కువ రోజులు తిరిగి ఇంటికి రాలేకపోతే ఇంటి వివరాలు పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

అచ్యుతాపురం : సంక్రాంతి పండగలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ ఎం బుచ్చిరాజు హెచ్చరించారు. అచ్యుతాపురంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పండగ సందర్భంగా కోడి పందాలు పేకాటలు, గొర్రెపోతు పందాల వంటివి ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. డబ్బులు తీసుకొని పోలీసులను మేనేజ్ చేస్తామని ఎవరైనా చెప్పినా అసలు నమ్మవద్దని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కబడీ, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలను నిర్వహించుకోవాలని సూచించారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కలగ లక్ష్మి గున్నయ్య నాయుడు అన్నారు. మండలంలోని తీడ గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమేష్, గ్రామ సర్పంచ్ చిరికి సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి-కశింకోట : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై కశింకోట మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కలగ లక్ష్మీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సభలో అన్ని శాఖల అధికారులు గ్రామ పనుల గురించి చర్చించి వాటిని పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగ గున్నయ్య నాయుడు, మండల ప్రత్యేక అధికారి రోజా రాణి, ఎంపిడిఓ రవి కుమార్, పెంటకోట శ్రీనివాసరావు, ఎంఎంఎస్ ఏపిఎం శ్రీనివాసరావు, ఏపిఓ శివ, మండల సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలను ఇబ్బందిపెడితే సహించం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:తమ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. టీడీపీ కార్యకర్తల సోషల్ మీడియా పోస్టులపై నర్సీపట్నం టౌన్ పోలీసుల వేధింపులకు నిరశిస్తూ శుక్రవారం టౌన్ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో తమ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి భయ బ్రాంతులకు గురి చేయడం సమంసం కాదన్నారు. గొలుగొండ మండల టీడీపీ సీనియర్ నాయకులు అడిగర్ల అప్పలనాయుడును వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్భాషలాడారని ఆ ఘటనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా నేటి వరకు స్పందించ లేదన్నారు. దళిత నాయకులు నేతల నాగేశ్వరరావు కేటుగాళ్ల లిస్టులో ఫోటో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం జరిగిందని, ఆ ఘటనపై కూడా నర్సీపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఇన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నా వాటిపైన స్పందన లేని పోలీసులు సోషల్ మీడియాలో జరిగిన ఘటనలు తీసుకొని అర్ధరాత్రి వేళలో ఇళ్లకు వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు


మాట్లాడుతున్న ఎంపిపి

ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -రావికమతం: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పైలరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పైలరాజు మాట్లాడుతూ, ప్రత్యేకమైన ప్రణాళికను సిద్ధం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రజలందరితో గ్రామ సభలు ఏర్పాటు చేసుకొని మన గ్రామ అభివృద్ధికి ఏడాదికి అవసరమైన పనులన్నీ గుర్తించాలన్నారు.ఎస్టిమేట్స్ వేయించుకొన్ననాడే ఆ పనులను చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామసభల్లో శాఖల అధికారులు పాల్గొని అవసరాలు గుర్తించి వాటిని నమోదు చేయాలన్నారు. ఉపాధి హామీ, మండల, జిల్లా పరిషత్తు, శాసనసభ్యులు, ఎంపీ తదితర నిధులను సేకరించుకొని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, ఏఈ గోపినాథ్, ఏపీవో కాశి పాల్గొన్నారు.


నగదు ఇస్తున్న నేతలు

ఎపిటిఎఫ్ నేతల ఆర్థిక సాయం

ప్రజాశకి-చీడికాడ:మండల విద్యాశాఖలో పనిచేస్తున్న ఎంఆర్సి సిబ్బందికి మండల ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక ఆర్ సి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేయడంతో ప్రభుత్వం వారికి వేతనాలు నిలిపివేసింది. ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు సిబ్బందికి ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బివి రమణ, యూనియన్ నాయకులు పాటూరి వరాహమూర్తి పాల్గొన్నారు.

రౌడీ రాజకీయాలు మానుకోవాలి

ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు రౌడీ రాజకీయాలు మానుకోవాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. శుక్రవారం నర్సీపట్నం టౌన్ స్టేషన్‌లో సోషల్ మీడియా తమ కార్యకర్తలపై తప్పుడు ప్రచారం చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నారని ఎస్పై సుధాకర్‌కు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రౌడీయిజం, గుండాయిజంతో తమ పార్టీ నాయకులను బెదిరింపులకు గురి చేయడం తగదన్నారు. ఆనాడు రాష్ట్రాన్ని దోచుకున్న దోపిడి దొంగలు చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

పంచాయతీల నిధులు ప్రభుత్వం జమ చేయాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:తాజాగా 4రోజుల క్రితం గ్రామాల అభివద్ధికి కేంద్రం విడుదల చేసిన రూ.988 కోట్లు రూపాయల నిధులు రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించాలని చూస్తుందని, తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ చాంబర్ ఉపసర్పంచ్ యేజర్ల వినోద్ రాజు ఆరోపించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, తాజాగా దొంగిలించిన 600 కోట్ల రూపాయలు 4రోజులలో పంచాయతీల, మండల పరిషత్తుల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో జమ చేయాలని, లేని పక్షంలో రాజకీయాలకతీతంగా సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలతో కలిసి తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. రాష్ట్రంలోని 12,918 గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-23వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండవ విడత నిధులు 988 కోట్లను విడుదల చేసినట్లు తమకు కేంద్ర ప్రభుత్వ అధికారుల నుంచి సమాచారం వచ్చిందన్నారు. కేంద్రం పంపిన 988 కోట్ల రూపాయలలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 393 కోట్లను పంచాయతీల ఖాతాల్లో జమ చేసిందన్నారు. నిధులు జమ చేసేంతవరకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో పోరాటాన్ని ఆపే ప్రసక్తి లేదని హెచ్చచరించారు.


మాట్లాడుతున్న వైసిపి ఇన్‌చార్జి జోగులు

రాష్ట్రంలో సామాజిక పాలన

ప్రజాశక్తి -యస్.రాయవరం:ఈ నెల 19 వ తేదీన విజయవాడలో జరుగనున్న భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలంతా భారీగా తరలి రావాలని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం అడ్డురోడ్డులో క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలతోనే రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధమైన సంక్షేమ పరిపాలన, సామాజిక సాధికారితతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలిస్తున్నారన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యంత ఎత్తయిన విగ్రహం నిర్మించడంపై కొనియాడారు. ఎమ్మెల్యేనైన తనను రాజ్యసభకు పంపడంతో సిఎం దార్శినికతను తెలియచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజా సాగి సూర్యనారాయణరాజు, బొలిశెట్టి గోవిందరావు, చిక్కాల రామారావు, వీసం రామకృష్ణ, జెడ్పీటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్లు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్థలం కేటాయింపునకు వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: పట్టణంలో అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ త్వరలోనే అధికారులతో మాట్లాడి అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. దీనిపై దళిత సంఘాల ఐక్యవేదిక ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు, సీనియర్ దళిత నాయకులు నేతల నాగేశ్వరరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గాతాడ సహదేవుడు, ఎమ్మార్పీఎస్ డివిజన నాయకులు కోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ మాట్లాడుతూ, గత ఐదు నెలలుగా వ్యవసాయశాఖ అధికారి సెలవులో ఉండటంతో పనులు జరగలేదన్నారు. దీంతో ఇన్ చార్జ్ ఏఒగా రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్

అరకు ఎంఇఒ సరెండర్

ప్రజాశక్తి-పాడేరు:అరకు మండల విద్యాశాఖాధికారి-1 వి.త్రినాధారావును ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేసారు. వి. త్రినాధారావు తన విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఆయనపై విచారణకు ఆదేశించటం జరిగిందని, విచారణాదికారికి సహకరించ లేదన్నారు. ఉద్దేశ పూర్వకంగానే జిల్లా కలెక్టర్ సమీక్షలకు హాజరు కాలేదని, ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ ఆయనలో మార్పు రాలేదని గుర్తిస్తూ ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపించారు.


కేలండర్ ఆవిష్కరిస్తున్న వర్తకులు

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో వ్యాపారస్తులు వర్తకసంఘం కేలండర్ ఆవిష్కరణ చేశారు. ప్రతి ఒక్క షాప్‌కి వెళ్లి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. . ఈ కార్యక్రమంలో నాని బాబు, జోగుబాబు, జోగినాదం, చక్రి, వాసు, రామకృష్ణ, జగదీష్, గోవింద్, వుడా రాజా, సంతోష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కె.ఎల్లవరం గ్రామ పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ధనుంజై, చేతన, జివి.రాజు గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వలగల పెద్ద దేవుడు, సచివాలయ కన్వీనర్ అనిమిరెడ్డి వెంకటరమణ, డాక్టర్లు గాయత్రి, చైతన్య, కీర్తి, బిజెపిఎ.ప్రసాద్, ఈఒపిఆర్‌డి రఘు, ఎంఎల్‌హెచ్ పి హెల్త్ అసిస్టెంట్లు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


హాజరైన వైద్యులు, సిబ్బంది

బహుజన ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో బిఎస్పీ నియోజకవర్గ అభ్యర్ధి బొట్టా నాగరాజు అధ్యక్షతన బహుజన ప్రచార రథాన్ని శుక్రవారం బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి ప్రారంభించారు. ముందుగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 5 శాతం ఉన్న పెట్టుబడిదారులు రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. బిఎస్పీ పార్టీ అధికారంలోకి వస్తే విద్య, వైద్య రంగంలో విప్లవత్మక మార్పులు చేస్తామన్నారు. అనంతరం అంగన్వాడీ కార్యాకర్తలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు ఎన్.చిరంజీవి, కార్యదర్శి సంజీవ్ వాడపల్లి, కన్వీనర్ కొల్లు గంగాధర్, బివియఫ్ జిల్లా నాయకులు ఆనంద్, యూత్ నాయకులు సూరిబాబు, సీనియర్ నాయకులు అప్పలనాయుడు, నవీన్, నూకరాజు, బబులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు, గిరిజనులు

పోడు పట్టాలివ్వాలని ఆందోళన

ప్రజాశక్తి - మాడుగుల: మండలంలో 314 మంది గిరిజనులు పోడు భూములు పట్టాలు ఇవ్వాలని శుక్రవారం తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తహశీల్దార్ పీవీ రత్నంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలు కార్లి భవాని, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ, మాడుగుల మండలంలో 2022 సంవత్సరంలో నవంబరు, డిసెంబర్ నెలల్లో పోడు భూములకు సర్వేలు చేసి 314 మందిని అర్హులుగా గుర్తించారని తెలిపారు. సర్వేలు చేపట్టి సంవత్సరం గడుస్తుందని ఇంతవరకు గిరిజనులకు పట్టాలు ఇవ్వకపోవడం బాధాకరమని వారు తెలిపారు. సర్వే అయినటువంటి గిరిజనులకు ఎస్.డి.ఎల్.సి. పెట్టి సర్వే చేసిన వారికి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కృష్ణ , అల్లంగి చిన్నారావు, సోమల అప్పారావు, ఉండూరు ఈశ్వరరావు, కటికి దేముడు, గిరిజనులు పాల్గొన్నారు..



సిబ్బందిపై అసహనం వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ

రెవెన్యూ సిబ్బందిపై అసహనం

- తప్పుడు నివేదికపై నిలదీత

ప్రజాశక్తి- కోటవురట్లం: రెవెన్యూ అధికారుల పనితీరుపై మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు అసహనం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించండి సృష్టించడం చేయవద్దని మాజీ ఎమ్మెల్సీ శుక్రవారం రెవెన్యూ సిబ్బందిపై మండిపడ్డారు. సర్వే నెంబర్ 4.31/1 బి లోగల అసైన్డ్ భూమి 1988 సంవత్సరం నుండి సాగులోఉన్న భూమిపై రెవెన్యూ అధికారుల ప్రలోభాలకు లోనై వివాదం సృష్టించి రాజకీయం చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఐదు నెలలుగా కార్యాలయం చుట్టూ పెట్ల లక్ష్మి తిరుగు తుందన్నారు. 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిపై గతంలో నర్సీపట్నం డివిజన్ రెవెన్యూ అధికారులు తప్పుడు పత్రాలు సృష్టించడం, వాటి ఆధారంగా భూయజమానులు సాగులోలేరంటూ తప్పుడు రిపోర్టు ఇవ్వడం పట్ల ఉపతహసిల్దార్ సోమశేఖర్, గ్రామ రెవెన్యూ అధికారి ఆశారత్నంపై బాధితురాలు సహా పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పందూరు రెవెన్యూ సమస్యపై బాధితురాలు పెట్ల లక్ష్మి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో చేసిన ఫిర్యాదు పట్ల రెవెన్యూ సిబ్బంది తప్పుడు రిపోర్టు పంపడంపై అధికారులను నిలదీశారు. ఇదే పరిస్థితి కొనసాగితే కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేయవలసి ఉంటుందని ఏ ఆధారాలతో తప్పుడు రిపోర్ట్ పంపించారని, తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణరావు, టిడిపి నాయకులు సత్తిబాబు తదితరులు ఉన్నారు.

జూదాలాడితే చర్యలు

ప్రజాశక్తి- రావికమతం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ, గ్రామాల్లో కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, గుళ్ళు ఆటలు ప్రదర్శించరాదన్నారు. పండగ సందర్భంగా ప్రయాణాలు సాగించేటప్పుడు మహిళలు బంగారు వెండి ఆభరణాలను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు.

అంగన్‌వాడీలకు ప్రజా మద్దతు

-సమ్మె శిబిరాల్లో సంతకాల సేకరణకు స్పందన - పలుచోట్ల వినూత్న నిరసనలు



అచ్యుతాపురంలో గడ్డి తింటూ నిరసన



నర్సీపట్నంలో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు శుక్రవారం సమ్మెను కొనసాగించారు. సమ్మె శిబిరాల్లో సంతకాలు సేకరించారు. పలు చోట్ల వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు.

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు న్యాయ సమ్మతమైన డిమాండ్లతో చేస్తున్న సమ్మెను పరిష్కారం చేయకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. అంగన్వాడీల సమ్మె 32వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షలు కొనసాగించారు. శిబిరం వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలన్నారు. జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చిన మేరకు అంగన్వాడీల జీతాలు పెంచాలన్నారు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు వై.తులసి, కార్యదర్శి ఎల్.శ్రీదేవి, ఎఐటియుసి అనుబంధ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అనసూయాదేవి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి పి.లక్ష్మి పాల్గొన్నారు.

ఐద్వా, పిఎన్ఎం సంఘీభావం

పెందుర్తి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా నిరాహార దీక్షలు ఏడోరోజుకు చేరుకున్నాయి. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు మౌలాలి, ఐద్వా నేత బి.అనంతలక్ష్మి అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మౌలాలి మాట్లాడుతూ, అంగన్వాడీల సమస్యలపై ఆటపాటల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి, వారిని చైతన్యవంతం చేయడం ద్వారా అంగన్వాడీల ఆందోళనకు నైతికమద్దతు కూడగడతామని, తద్వారా ప్రజామద్దతుతో రానున్న రోజుల్లో అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వంపై పోరాటానికి సమాయత్తం చేస్తామన్నారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.బృందావతి పాల్గొన్నారు.

ఆనందపురం: అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం 32వ రోజున ఆనందపురం కూడలి వద్ద ధర్నా చేపట్టారు ధర్నాలో భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు పాల్గొని సంఘీభావం తెలియజేసారు సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నర్సింగరావు, అంగన్వాడీల యూనియన్ భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.వెంకటలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి జిల్లా కోశాధికారి కె.పద్మావతి పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో సంతకాల కార్యక్రమం చేపట్టారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి.వెంకటరావు, వ్యాపార సంఘం గౌరవ అధ్యక్షులు మామిడి తాతాజీలు సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.దుర్గారాణి, ప్రోజెక్టు అధ్యక్షులు బి.సుబ్బలక్ష్మి, నాయకులు కవిత,లక్ష్మీరాజ్యం, రమణమ్మ పాల్గొన్నారు.



ఆనందపురంలో..

పాయకరావుపేట: మండలంలో అంగన్వాడీల సమ్మె ముప్పై రెండు రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ముప్పై రెండు ఆకారంలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, నూకరత్నం, సత్యవేణి, తులసి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడిలు సమ్మెలో భాగంగా నిరసన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, సీతారత్నం, లక్ష్మి, రత్నం, పద్మ, సత్యవతి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలో అంగన్వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు. అంగన్వాడీలకు యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గాయత్రి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ప్రాజెక్టు నాయకులు వి.సామ్రాజ్యం, మహాలక్ష్మీ, కృష్ణవేణి, శోభా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ గొలుగొండలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

మాడుగుల: అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జగనన్నకు చెబుదాం 'కోటి సంతకాల విన్నపం' కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల స్థానిక బస్టాండ్ ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మె 32వ రోజుకు చేరుకుంది. సంతకాల సేకరణ నిర్వహించారు. మాడుగుల లో సుమారు 500 మంది సంతకాలు చేసినట్లు అంగన్వాడి నాయకులు తెలిపారు. అంగన్వాడీ ఉద్యోగులపై ప్రభుత్వం కక్షతో ఉద్యోగాలు తొలగిస్తామని నోటీసులు పంపించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు ఆర్.రామలక్ష్మి, డి.,పార్వతి. వి.ధనలక్ష్మి తెలిపారు.

అనకాపల్లి: అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో అంగనవాడి సమ్మె పరిష్కరించాలని జగనన్నకు చెబుదాం పేరుతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, కార్యవర్గ సభ్యురాలు కృష్ణవేణి మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు ఉమా నారాయణమ్మ, కాసులమ్మ, తనుజ పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రంలో అంగన్వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు. సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, అంగన్వాడీలు రామలక్ష్మి, జయలక్ష్మి, హేమలత, సరస్వతి , తులసి లక్ష్మి,ఉమాదేవి, రేవతి పద్మ, సత్యవతి పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆందోళన కొనసాగింది. సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు, యూనియన్ నాయకులు మంగ, సుజాత సావిత్రి, సంతోషి, నూక రత్నం, లక్ష్మీ, రమణమ్మ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజల నుండి సంతకాల సేకరించారు. అధికార వైసీపీకి చెందిన పలువురు సర్పంచుల సైతం అంగన్వాడీలకు మద్దతుగా సంతకాలు చేశారు. సంఘ ప్రతినిధులు ఆది వరలక్ష్మి, ఎలిశెట్టి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు శుక్రవారం 32వ రోజు కూడా సమ్మె కొనసాగించారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళనలు విరమించబోమని హెచ్చరించారు.

సబ్బవరం : మండలంలోని అంగన్వాడీల రిలే దీక్షా శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ సందర్శించి మాట్లాడారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, ఎస్మా యాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వివి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, డి.పుష్ప, ఎస్.జగదీశ్వరి, ఆర్.శివరామ లక్ష్మీ, వి.సుభాషిణి, ఎం. కనకమ్మ, జి. అరుణ కుమారి, ఎస్. రమణమ్మ, డి.భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎన్. సత్యవేణి పాల్గొన్నారు.

పచ్చ గడ్డి తింటూ నిరసన

అచ్యుతాపురం : అచ్చుతాపురం తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీల దీక్షా శిబిరంలో అంగన్వాడీలు పచ్చగడ్డి నోట్లో పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. వీరి శిబిరాన్ని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కాండ్రేగుల రామ సదాశివరావు, యుటిఎఫ్ జిల్లా ప్రతినిధి మారిశెట్టి వెంకట అప్పారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి బొడ్డేడ రామ్ కుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు బి జయలక్ష్మి, వరలక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా రద్దుకు సిఐటియు బైకు ర్యాలీ

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తక్షణమే రద్దుచేయాలని, జీతాలు పెంచాలని కోరుతూ సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదాంబ సెంటర్ నుంచి డాబాగార్డెన్, సంఘం శరత్ జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, ఆశీలమెట్ట మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. అంగన్‌వాడీల పోరాటం స్ఫూర్తిదాయకమైనదన్నారు. సర్కారు బెదిరింపులు ఆపాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ముఠా యూనియన్ అధ్యక్షులు ఎం.సుబ్బారావు, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి.అప్పలరాజు, షాప్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వై.రాజు, మున్సిపల్ యూనియన్ నాయకులు వి.కృష్ణారావు, శ్రావణ్, ట్యాంక్స్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు గౌరీష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



బైకు ర్యాలీ చేపడుతున్న సిఐటియు నాయకులు